ప్రజాశక్తి
శుక్రవారం 7 నవంబర్ 2025 5
శ్రీ సత్యసాయి

సిఐటియు నుంచి ఈఎస్. వెంకటేష్ బహిష్కరణ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

గతంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన ఈఎస్ వెంకటేష్‌ను సిఐటియు నుంచి బహిష్కరించినట్లు ఆసంఘం నాయకులు తెలిపారు. శ్రీ సత్య సాయి జిల్లా సిఐటియు కార్యాలయంలో గురువారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎల్ నరసింహులు, జిల్లా అధ్యక్షులు జడ్పీ శ్రీనివాసులు, కోశాధికారి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు పెడబల్లి బాబా, కార్యదర్శులు పైపల్లి గంగాధర్, రాము, బాబ్జాన్, ముత్యాలు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఐటియు పద్ధతులకు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఈఎస్ వెంకటేష్‌ను సిఐటియు నుంచి బహిష్కరించామన్నారు. భవిష్యత్తులో సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించే ఎలాంటి కార్యక్రమాలకు ఆయనకు ఎలాంటి సంబంధం ఉండదని తెలిపారు. సిఐటియు పేరు చెప్పి ఎక్కడైనా కార్మికులకు సంబంధించి ఎలాంటి వ్యవహారాలు చేయరాదని అన్నారు. ఈ మేరకు గురువారం నిర్వహించిన ఆఫీస్ బేరర్ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు నాయకులు తెలిపారు.

భూసేకరణ పేరుతో రైతులకు అన్యాయం

వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు

ప్రజాశక్తి - రొద్దం

సోలార్ కోసం రైతుల వద్ద నుంచి భూముల సేకరణ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం చేయాలని భూసేకరణ పేరుతో రైతులను ప్రభుత్వం అన్యాయం చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు అన్నారు. గురువారం మండలంలోని కొగిర గ్రామంలో వ్యవసాయ కార్మికసంఘం నాయకులు పర్యటించారు. ఈసందర్భంగా సోలార్‌కోసం భూములు కోల్పోతున్న రైతులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దడాల సుబ్బారావు మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో శ్రీ సత్య సాయి జిల్లాలో సోలార్, ఎరో స్పేస్, సెజ్ ల పేరుతో వేలాది ఎకరాల భూమిని తీసుకుని ఆ భూములను బ్యాంకు లో తనఖా పెట్టి కోట్ల రూపాయలు రుణం తీసుకున్నారన్నారు. అయితే రైతుల నుంచి తీసుకున్న భూముల్లో ఒక్క పరిశ్రమ కూడా పెట్టాకుండా రైతుల నుండి భూమిని దూరం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం కూడా ఇదే పద్ధతిని అవలంభిస్తోందని విమర్శించారు. అధికారం లోకి వచ్చిన వెంటనే సోలార్ ఏర్పాటు పేరుతో భూసేకరణ చేపట్టిందన్నారు. ఎకరాకు రూ. 30వేల ప్రకారం 30 సంవత్సరాల వరకు లీజు పద్ధతి తీసుకొంటామని నమ్మబలుకుతూ రైతులను మోసం చేయాడనికి సిద్ధమవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంలో రైతును భూమికి దూరం చేయడం తప్ప మరేదీ కాదని అన్నారు. ప్రభుత్వాల నిర్ణయాల వల్ల రైతులు ఆ భూముల్లో కూలీలుగా మారుతారన్నారు. ప్రభుత్వం ఇలాంటి దుర్మార్గమైన చర్యలకు పూనుకుంటోందన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం భూ సేకరణ చేయాలన్నారు. రైతుల ఆమోదం లేకుండా బలవంతపు భూ సేకరణ చేయరాదన్నారు. ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తే వ్యవసాయ కార్మిక సంఘం వారికి అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరంగి ప్రవీణ్ కుమార్, అధ్యక్షులు వెంకటేష్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, అధ్యక్షులు హరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్,జిల్లా కమిటీ సభ్యులు వెంకటరమణ, నారాయణ, రైతులు సూర్యనారాయణ, చిన్న అంజినప్ప, చెన్నరాయుడు, సుబ్రహ్మణ్యం, సత్యనారాయణ, ఆంజినప్ప, చిన్న గంగన్న, నరసింహులు, నారాయణప్ప, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు..

రైతులతో మాట్లాడుతున్న నాయకులు

నేటి నుంచి రెవెన్యూ ఉద్యోగుల ఆట.. పాట...

మూడు రోజుల పాటు రాష్ట్ర స్థాయి పోటీలు
ప్రారంభించనున్న ఎపి చీఫ్ సెక్రటరీ విజయానంద్
ప్రత్యేక ఆహ్వానితులుగా పివి.సింధు, జ్యోతి సురేష్, శ్రీకాంత్

పోటీల నిర్వహణ ఏర్పాట్లపై చర్చిస్తున్న రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకులు, అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనంతపురం నగరంలో మూడు రోజులపాటు ఆట,పాటల పోటీలు సాగనున్నాయి. నగరంలోని ఆర్డీటీ అనంత క్రీడా గ్రామంలో ఈనెల ఏడు నుంచి తొమ్మిదవ తేది వరకు జరుగుతున్న కార్యక్రమానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాలతోపాటు, రాష్ట్ర కేంద్రంలోని రెవెన్యూ ఉద్యోగులు పాల్గొంటున్నారు. మొట్టమొదటిసారి అనంతపురంలో జరుగుతన్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అవసరమైన ఏర్పాట్లను రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు చేస్తున్నారు. రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొప్పిరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకట రాజేష్‌లతోపాటు అనంతపురం, సత్యసాయి జిల్లాల రెవెన్యూ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు గత కొన్ని రోజులుగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండే విధంగా ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి సుమారు 2500 మందికిపైగా పాల్గొనేందుకు ఉద్యోగులు అనంతపురం వచ్చారు. ఈపోటీల్లో ఇండోర్, అవుట్‌డోర్ పోటీలు నడుస్తున్నాయి. త్రోబాల్, వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్, కబడ్డి, క్యారమ్స్, చెస్‌లతోపాటు క్రికెట్, అథ్లటిక్స తదితర విభాగాల్లో పోటీలు జరుగనున్నాయి. వీటితోపాటు మ్యూజికల్ ఛైర్స్ ఉంటాయి. ప్రతి రోజూ సాయంత్రం ఆరు గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నడువనున్నాయి. అన్ని ఒకేసారి వేర్వేరు మైదానాల్లో జరిగే విధంగా ఏర్పాట్లు చేశారు.

ముఖ్య అతిథులుగా చీఫ్ సెక్రటరీ విజయానంద్

మూడు రోజులపాటు జరుగుతున్న రెవెన్యూ క్రీడల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ విజయానంద్ ప్రారంభించనున్నారు. సిసిఎల్ఎ స్పెషల్ సెక్రటరీ జయలక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. అంతర్జాతీయ క్రీడాకారులు ఒలంపిక్ గోల్డ్ మెడలిస్టు పివి.సింధూ, ఆర్చరీ వరల్డ్ ఛాంపియన్షు మెడలిస్టు వన్నెం జ్యోతి సురేఖ, అంతర్జాతీయ బ్యాడిటన్ ప్లేయర్ కె.శ్రీకాంత్ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరుకానున్నారు. గౌరవ అతిథులుగా ఐఎఎస్‌లు, పలువురు హాజరవు తున్నారు.

ప్రారంభ కార్యక్రమం ఇలా..

మొదటి రోజు ఏడవ తేదిన ప్రారంభోత్సవ కార్యక్రమం ఈ విధంగా ఉండనుంది

9.00 గంటలకు ముఖ్య అతిథితులు విచ్చేస్తారు
9.05 ముఖ్య అతిథులుగాను వేదిక మీదకు ఆహ్వానిస్తారు
9.15 స్పోర్ట్సు పతాకావిష్కరణ ఉంటుంది
9.25 ముఖ్య అతిథి చేత జ్యోతి ప్రజ్వలన ఉంటుంది
9.35 మార్చు ఫాస్టు
9.55 రెవెన్యూ ఉద్యోగుల సంఘంరాష్ట్ర అధ్యక్షుడి ప్రారంభోపన్యాసం ఉంటుంది
10.05 స్పోర్టు మీట్ సందేశాన్ని ప్రధాన కార్యదర్శి ప్రవేశపెడతారు
10.15 జిల్లా అధ్యక్షుడి సందేశం
10.35 ముఖ్య అతిథి సందేశం
10.45ఆయా టీమ్‌ల క్యాప్టన్‌ల ప్రమాణం
10.55 ఆటలను సిసిఎల్ఎ స్పెషల్ సెక్రటరీ ప్రారంభిస్తారు.

పకడ్బందీ ఏర్పాట్లు : జేసీ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మార్చిఫాస్ట్ రిహార్సల్స్

అనంతపురం జిల్లాలో నవంబర్ 7, 8, 9 తేదీల్లో 7వ రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహిస్తున్నామని అందుకోసం అన్ని ఏర్పాట్లు చేపట్టామనిజాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ పేర్కొన్నారు. స్థానిక ఆర్డీటీ స్టేడియంలో 7వ రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలకు సంబంధించిన రిహార్సల్స్‌ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ 7, 8, 9 తేదీల్లో 7వ రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాల్లో రాష్ట్ర స్థాయి రెవెన్యూ ఉద్యోగులు పాల్గొంటున్నారన్నారు. ఇందులో రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, తదితరులు పాల్గొనడం జరుగుతుందన్నారు. రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 7వ రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలను అనంతపురం జిల్లాలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. క్రీడా ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ ఏ.మలోల, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకట రాజేష్, ఆర్డీవోలు కేశవ నాయుడు, శ్రీనివాస్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, మల్లికార్జున రెడ్డి, రామ్మోహన్, మల్లికార్జున, రమేష్ రెడ్డి, తిప్పేనాయక్, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దివాకర్‌రావు, సెక్రటరీ సోమశేఖర్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోషియేషన్ ప్రెసిడెంట్, సెక్రటరీ సంజీవరెడ్డి, హరిప్రసాద్ రెడ్డి, సత్యసాయి ఏపీఆర్ఎస్ఓ ప్రెసిడెంట్ మధునాయక్, మీడియా ఇన్‌ఛార్జి మునివేలు, డీఎస్డీవో మంజుల తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం పెంపొందిద్దాం

ప్రజాశక్తి-హిందూపురం

పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పలువురు కోరారు. సప్తగిరి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 1 ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరంలో భాగంగా గురువారం కొల్లకుంట ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సప్తగిరి డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనాథ్ రెడ్డి మాట్లాడుతూ, ఇంటింటా ఒక చెట్టు నాటితే ఊరంతా ఒక వనం లాగా మారుతుందని, ప్రతి ఒక్కరూ ఒక చెట్టును నాటి సంరక్షించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ ఉద్యమ కమిటీ సభ్యుడైన కొట్నూరు భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ చెట్లు నాటడం వల్ల వాతావరణ కాలుష్యం తగ్గి వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, ప్రతి ఒక్కరూ చెట్లను సంరక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సప్తగిరి కళాశాలల ఏవో గంగిరెడ్డి, ఎన్ఎస్ఎస్ పిఒ ఎస్.పార్థసారథి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పెచ్చులూడుతున్న పోలీస్‌స్టేషన్ భవనం

ప్రజాశక్తి-నల్లమాడ

స్థానిక పోలీస్ స్టేషన్ భవనం శిథిలావస్థకు చేరంది. దీంతో తరచూ పైకప్పు పెచ్చులూడి పడుతున్నాయి. దీంతో కార్యాలయ సిబ్బంది ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఈ భవనం బాగా నానింది. ఈ క్రమంలో గురువారం ఉన్నఫళంగా పైకప్పు పెచ్చులూడి కుర్చీలు, బెంచీలపై పడ్డాయి. దీంతో స్టేషన్‌లోకి వెళ్లాలంటే పోలీసులు భయందోళనలు వ్యక్తం చేస్తున్నారు. కావున ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని లేదా స్టేషన్‌ను మరో భవనంలోని మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎంపీడీవోపై మాజీ ఎంపీపీ భర్త దాడి

పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు

ప్రజాశక్తి - మడకశిర టౌన్

రొళ్ల ఎంపిడిఒపై మాజీ ఎంపిపి భర్త గురువారం దాడికి పాల్పడ్డాడు. దీంతో బాధిత ఎంపిడిఒ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈఘటనకు సంబంధించిన వివరాలు... గతంలో చేసిన పనులకు బిల్లుల విషయంపై మాజీ ఎంపిపి భర్త విజయ రంగయ్యగౌడ్ గురువారం ఎంపీడీవో నాగేశ్వర శాస్త్రిని కలిశారు. పెండింగ్ బిల్లులు వెంటనే పూర్తి చేయాలని కోరగా ప్రస్తుతం మండల సర్వసభ్య సమావేశం తీర్మానం అయిన తర్వాతనే బిల్లు చేయడం జరుగుతుందని ఎంపీడీవో సమాధానం ఇచ్చారు. దీంతో ఆగ్రహానికి గురైన మాజీ ఎంపీపీ భర్త ఎంపీడీవోపై దుర్భాషలాలతో దాడికి ప్రయత్నించాడు. కార్యాలయం నుండి బయటకు వచ్చి కారు ఎక్కుతున్న తనపై చెప్పు విసిరాడని ఎంపిడిఒ స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

అధికారుల జోలికి వస్తే సహించం : ఎమ్మెల్యే

రొళ్ల మండల ఎంపీడీవో నాగేశ్వరశాస్త్రిపై వైసీపీ మాజీ ఎంపీపీ భర్త విజయరంగేగౌడ్ చేసిన దాడిని ప్రభుత్వంపై దాడిగా పరిగణిస్తున్నామని అధికారుల జోలికొస్తే సహించేది లేదని స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్. రాజు హెచ్చరించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి పాలనను చూసి ఓర్వలేని వారు ఆ కోపాన్ని నిజాయితీగల అధికారులపై చూపించడం దుర్మార్గమన్నారు. కారణాలు ఏవైనా ప్రభుత్వ అధికారిని దుర్భాషలాడడం, పిడిగుద్దులు గుద్దడం ఆటవిక చర్య అని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. విజయరంగేగౌడ్ చేతిలో దాడికి గురైన రొళ్ల ఎంపీడీవో నాగేశ్వరశాస్త్రికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని అన్నారు.

నిధులను సద్వినియోగం చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి శత జయంతి ఉత్సవాలకు ప్రభుత్వం వివిధ శాఖలకు కేటాయించిన నిధులను సద్వినియోగం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ కోరారు. ఈ మేరకు ఆయన గురువారం సిపిఎం జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. శ్రీసత్యసాయి శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ప్రభుత్వం దాదాపు 42 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసినట్లు తెలిసిందన్నారు. ఈ నిధులను సద్వినియోగపరచి ప్రజలకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ నిధులను మూడు నెలల ముందు కేటాయించి ఉంటే అభివృద్ధి పనులు సవ్యంగా సాగేవని సమయం లేని కారణంగా నిధులు దుర్వినియోగం అవ్వడానికి ఆస్కారం ఉందని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా పుట్టపర్తి పట్టణంలో అంతర్గత డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా, తయారైందని దానిని క్రమబద్ధీకరించాలని, అదేవిధంగా రోడ్లు ,పార్కులు, బ్యూటిఫికేషన్ పనులు, జయంతి ఉత్సవాలకు వచ్చే సత్య సాయి భక్తులకు ఏర్పాట్ల విషయంలో చేపట్టే అభివృద్ధి పనులను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఇరువురు పర్యవేక్షించాలన్నారు. జయంతి ఉత్సవాలకు లక్షలాదిమంది వస్తారని ట్రస్ట్ వర్గాలు చెబుతున్నాయని వారందరికీ మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

గ్రామీణుల్లో సామాజిక చైతన్యం తీసుకురావాలి

ప్రజాశక్తి-హిందూపురం

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలను వివిధ అంశాలపై చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత యువతపై ఉందని బాల యేసు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జియావుల్లా ఖాన్ సూచించారు. గురువారం హిందూపురం రూరల్ మండల పరిధిలోని ఉడుగులపల్లిలో బాల యేసు డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్– 1 ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వారం రోజులపాటు నిర్వహించే ఈ శిబిరంలో వివిధ అంశాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా విద్య, ఆరోగ్యం, మూఢనమ్మకాలు వంటి అంశాలపై ప్రజలకు వివరించి అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రముఖ సంగీత గాయకులు, నంది అవార్డు గ్రహీత ఆదిమూలం సూర్య నారాయణ పాడిన సామాజిక చైతన్య పాటలు అందరిని అకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గిరీష్, అంగన్వాడి టీచర్ సునంద, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అశ్వర్థ నారాయణ, అధ్యాపకులు షాషావలి విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల 'రన్ ఫర్ యూనిటీ'

ప్రజాశక్తి-లేపాక్షి

లేపాక్షిలో గురువారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రన్ ఫర్ యూనిటీ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన హిందూపురం రూరల్ సిఐ జనార్దన్ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి పురస్కరించుకుని భారతదేశ ఐక్యతకు ప్రతీకగా దేశ వ్యాప్తంగా రన్ ఫర్ యూనిటీ ర్యాలీలు చేపట్టారన్నారు. అందులో భాగంగా స్థానిక విద్యార్థులు, యువతలో దేశ ఐక్యతను చాటేలా రన్ ఫర్ యూనిటీ నినాదంతో మారథాన్ పరుగు చేపట్టడం అభినందనీయన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నారాయణస్వామి, ఎంజెపి పాఠశాల విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

తనకల్లు : తనకల్లులో పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో 'రన్ ఫర్ యూనిటీ' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎస్ఐ గోపి, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు ఉత్సాహంగా రన్ ఫర్ యూనిటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎస్ఐ మాట్లాడుతూ దేశ ఐక్యత, సమగ్రత, సోదరభావం గురించి ప్రజల్లో చైతన్యం కలిగించడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యం అన్నారు. మన దేశం బలం ఐక్యతలోనే ఉందన్నారు. ప్రతి పౌరుడు ఉక్కుమనిషిగా పేరుగాంచిన సర్దార్ వల్లభాయ్ పటేల్ అడుగుజాడల్లో నడిచి దేశ సమగ్రతను కాపాడే బాధ్యత తీసుకోవాలని సూచించారు.

ముదిగుబ్బ : స్థానిక దొరిగల్లు రోడ్డులో 'ఎక్తా దివస్–రన్ ఫర్ యూనిటీ' కార్యక్రమం నిర్వహించారు. దేశాన్ని ఐక్యత చేయడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషిని స్మరించుకొంటూ స్థానిక పోలీస్ సిబ్బంది రన్ చేపట్టారు.

సామాజిక బాధ్యతతో మెలగాలి

ప్రజాశక్తి-హిందూపురం

నేటితరం యువత, విద్యార్థులు సామాజిక బాధ్యతతో మెలగాలని వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని యస్.డి.జి.యస్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో పూలకుంటలో గురువారం ప్రత్యేక ఎన్ఎస్ఎస్ శిబిరం ప్రారంభించారు. కళాశాల కమిటీ కార్యదర్శి బైసాని రాంప్రసాద్, కమిటీ సభ్యులు రమేష్ బాబు, ప్రిన్సిపాళ్లు జె.యస్.వి. ప్రసాద్, డాక్టర్ ఏ.నాగేంద్ర కుమార్, జిల్లా పరిషత్ స్కూల్ ఇన్‌ఛార్జి బి. చంద్రశేఖర్,యస్ యస్ పీవో బి. రాజన్న, యన్.సి.సి లెఫ్ట్ నెంట్ ఫణీంద్ర, ఫిజికల్ డైరెక్టర్ హేమంత్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ, చదువుతోపాటు సామాజిక బాధ్యత, సేవా బాధ్యతలను తెలుసుకోవడానికి, ప్రజా జీవన విధానాన్ని తెలుసుకోవడానికి ఇలాంటి శిబిరాలు ఎంత దోహదం చేస్తాయన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత స్థానానికి పోవాలంటే విద్యార్థి దశ నుండి సేవా దృక్పథం అలవర్చుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, గురువులు, దేశాన్ని ప్రేమిస్తూ మంచి నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని తెలిపారు. ఏదో ఒక రకంగా ప్రతి ఒక్కరూ సమాజానికి ఉపయోగపడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

సత్యసాయి శతజయంతి ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు : జేసీ

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

సత్యసాయి శతజయంతి ఉత్సవాలకు పటిష్టమైన ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లో అధికారులు, సత్యసాయి ట్రస్టు ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఇప్పటికే చేపట్టిన పనులు వాటి పరిస్థితి ఇంకా చేయాల్సిన పనులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ ఎవరికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా పనులు చేపట్టాలన్నారు. అధికారులు ట్రస్టు సభ్యులతో సమన్వయం చేసుకొని పనులు పూర్తి చేయాలన్నారు. జిల్లా అధికారయంత్రాంగమంతా ఈ ఉత్సవాలు విజయవంతంగా పూర్తి చేయడానికి కృషి చేయాలన్నారు. ఉత్సవాలు దగ్గర పడుతున్నాయని త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు ఎదురైతే ఉన్నతాధికారుల దృష్టికి వెంటనే తీసుకురావాలన్నారు. ఉత్సవాలు ప్రణాళిక బద్ధంగా విజయవంతం చేయడానికి జిల్లా అధికారులు ట్రస్టు ప్రతినిధులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ సూర్యనారాయణ రెడ్డి, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, వివిధ శాఖల అధికారులు, ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

చదువుతో పాటు హాజరుపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ట్రైసైకిల్ పంపిణీ అనంతరం విద్యార్థితో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

విద్యార్థుల చదువుతో పాటు వారి హాజరుపై ప్రత్యేక శ్రద్ధ దీసుకోవాలని కలెక్టర్ శ్యాం ప్రసాద్ మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులను ఆదేశించారు. గురువారం పుట్టపర్తి మండలంలోని జగరాజుపల్లి మంగళకర కళాశాలలో సమగ్ర శిక్ష శాఖ ఆధ్వర్యంలో మండల విద్యా అధికారులు, లైన్ విభాగాల అధికారులకు ఐఈ కార్యకలాపాలపై ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ జిల్లాలో సమగ్ర విద్యా బలోపేతానికి అవసరమైన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఉపాధ్యాయులు రాజకీయాలకు దూరంగా ఉండాలని, పాఠశాలలకు వేళకు హాజరు కావాలని సూచించారు. పిల్లల హాజరును క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని, లీవ్ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని, డ్యూటీ సమయంలో ఇతర కార్యక్రమాల్లో పాల్గొనకూడదని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు ప్లాన్ ఆఫ్ యాక్షన్‌తో పాఠశాలలకు వెళ్లి బోధన చేయాలని, విద్యార్థులను పాఠశాల సమయాల్లో బయటకు పంపకూడదని సూచించారు. విద్యార్థులు శుభ్రమైన దుస్తులు ధరించి, క్రమశిక్షణతో ఉండేలా చూడాలని, చదువులో వెనుకబడిన వారికి ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేయాలని తెలిపారు.జిల్లాలో పదవ తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతతో వ్యవహరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. పాఠశాలల్లో నీతి నియమాలు, క్రమశిక్షణ, కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా రూ. 1.50 లక్షల విలువ గల మూడు (ఒక్కొక్కటి రూ 50వేలు) ఎలక్ట్రిక్ మోటార్ వీల్‌చైర్లు ముగ్గురు వికలాంగ విద్యార్థులకు పంపిణీ చేశారు. హిందూపురానికి చెందిన కే. అశ్విన్ (డిగ్రీ), జి. బిందు శ్రీ (ఐదో తరగతి, కొండతిమ్మయ్యగారిపల్లి ఎంపీపీ పాఠశాల), షేక్ అబ్దుల్ (ఇంటర్మీడియట్, శెట్టిపల్లి)లకు వీల్‌చైర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష జిల్లా అధికారి దేవరాజు, జిల్లా విద్యాధికారి కిష్టప్ప, ఎంఇఒలు, లైన్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కూటమి హయాంలో అన్ని వర్గాలకు అన్యాయం : వైసిపి

రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న దీపికా వేణురెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

అధికారంలోకి వచ్చేందుకు ఆచరణ సాధ్యం కానీ హామీలను ఇచ్చి ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తోందని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త దీపికా వేణు రెడ్డి విమర్శించారు. హిందూపురం పట్టణంలోని 27వ వార్డు అంబేద్కర్ నగర్, బోయపేటలో రచ్చబండ, కోటి సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాలతో కూటమి మెడలు వంచుతామని తెలిపారు. పేదలకు ప్రభుత్వ వైద్యాన్ని అందని ద్రాక్షగా మార్చడమే చంద్రబాబు ధ్యేయంగా పెట్టుకున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న సంక్షేమ పనులు అంతంత మాత్రమేనని, కూటమిని కూకటి వేళ్లతో పీకేందుకు రాష్ట్ర ప్రజానీకం సిద్ధంగా ఉందని అన్నారు. అనంతరం వార్డులలో కమిటీలను ఏర్పాటు చేసి, రచ్చబండ కార్యక్రమంలో భాగంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు మడకశిర మున్సిపల్ చైర్మన్ జయరాజు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా మాజీ సోషల్ మీడియా ఇన్‌ఛార్జి రాజశేఖర్, రాజు, స్థానిక వార్డు ఇన్చార్జిలు అంబేద్కర్ నగర్ నవీన్, నరసింహులు, వార్డు కమిటి అధ్యక్షులు నారాయణ, వార్డు కమిటీ సభ్యులు వినయ్, కిరణ్, శ్రీకాంత్ ,రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి అమానుల్లా, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు మోహన్, 7వ వార్డు ఇన్‌ఛార్జి అయూబ్ బేగ్, నాయకులు శ్రీరాములు, చందు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'పిఎం డిడికెవై' కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రధానమంత్రి ధనధాన్య కృషి యోజన(పిఎండిడికెవై) పథకం దీర్ఘకాలిక లక్ష్యాలు-ప్రయోజనాలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం వ్యవసాయ అనుబంధ శాఖలు, ఇరిగేషన్, ఇండస్ట్రీస్, స్కిల్ డెవలప్మెంట్, బ్యాంకింగ్, తదితర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతుల విస్తరణ, ఉత్పత్తి, ఉత్పాదకత పెంపు, మార్కెటింగ్‌లో సులభతరం, గ్రామీణ ఉపాధి సృష్టి ప్రణాళిక ప్రధాన లక్ష్యాలు అన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి రామునాయక్, ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, ఎపిఎంఐపి పిడి సుదర్శన్, మత్స్య శాఖ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, భూగర్భ జల శాఖ అధికారి రాజశేఖర్, పశుసంవర్ధక అధికారి శుభదాస్, ఇరిగేషన్ అధికారి గురుమూర్తి, సెరికల్చర్ అధికారి శోభారాణి, జిల్లా సహకార అధికారి కృష్ణానాయక్, ఎల్‌డిఎం రమణకుమార్, పరిశ్రమల శాఖ అధికారి నాగరాజు, స్కిల్ డెవలప్మెంట్ అధికారి హరికృష్ణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

తప్పులేని ఓటరు జాబితా రూపొందించండి

జిల్లాలో తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ గురువారం అమరావతి నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా నుంచి కలెక్టరేట్‌లో పాటు జాయింట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ పాల్గొన్నారు. విసి అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ 2002లో ఓటర్ల జాబితా పునఃపరిశీలన జరిగిందని, సుమారు 23 ఏళ్ల తరువాత ఇప్పుడు చేపట్టనున్నారు. బిఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు కొత్త ఓటర్ల జాబితాను పకడ్బందీగా పునఃపరిశీలన చేయాలన్నారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులను సంప్రదించి, బూత్ స్థాయి ఏజెంట్లను నియోజకవర్గ అధికారులకు సమర్పించాలన్నారు. ఎన్నికల సిబ్బంది ఖాళీగా ఉన్నచోట కొత్త వారిని నియమించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ సూర్యనారాయణరెడ్డి, కలెక్టరేట్ ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

వందేమాతరం 150 వసంతాల ఉత్సవాలు నిర్వహించాలి

వందే మాతరం జాతీయ గేయం ఆవిష్కరణకు 150 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ నెల 7 నుంచి 2026 నవంబర్ 7వ తేదీ వరకు వందే మాతరం ఉత్సవాలు నిర్వహించాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. వందేమాతరం గేయం సందేశం, ప్రాధాన్యతను ప్రతిబింబించేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఉత్సవాల ప్రచారం, ప్రజా భాగస్వామ్యం సమృద్ధిగా ఉండేలా చూడాలన్నారు. ఈ నెల 7వ తేదీ ఉదయం 10 గంటలకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది వందేమాతర గేయాన్ని సామూహికంగా ఆలపించాలన్నారు.

వేతనాల కోసం 'ఉపాధి' సిబ్బంది నిరసన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లాలో ఉపాధి హామీ చట్టంలో పని చేస్తున్న సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.విజయప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ముందుగా ఉపాధి సిబ్బంది ప్రశాంతి గ్రామంలోని జిల్లా వాటర్ మేనేజ్మెంట్ అధికారి కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ బకాయి వేతనాలు మంజూరు చేయాలని, 23 శాతం పిఆర్‌సి, గ్రేడ్ ఫిక్సేషన్, గ్రాట్యుటీ అమలు, జెట్ సోర్టింగ్ ఉద్యోగులను ఎఫ్‌టిఈలుగా మార్చడం, ఉద్యోగోన్నతులు, హెల్త్ కార్డులు, తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. స్పందించిన పిడి మాట్లాడుతూ తక్షణం వీటిని సిఆర్‌డిఎ కార్యాలయ ఉన్నతాధికారులకు పంపి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎపి లక్ష్మీ, ద్యామా జెఏసి ప్రెసిడెంట్ మనోహర్, సాంకేతిక సహాయకుల ప్రెసిడెంట్ సాయినాథ్‌రెడ్డి, యూనియన్ నాయకులు, సాంకేతిక సహాయకులు, బివిటిలు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ చైర్మన్‌కు వినతి

కొత్తచెరువు: జిల్లాలో జాతీయ ఉపాధి చట్టంలో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం ఉపాధి హామీ జెఏసి జిల్లా అధ్యక్షులు మనోహర్ ఆధ్వర్యంలో పుట్టపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ పూల శివప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. స్పందించిన చైర్మన్ మీ సమస్యలను డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పసుపులేటి శ్రీనివాసులు, వీరాంజనేయులు పాల్గొన్నారు.

కొత్తచెరువులో మార్కెట్ యార్డ్ చైర్మన్ పూల శివప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉపాధి హామీ సిబ్బంది

పాఠశాల ఆవరణలో గుంతలు పూడ్చివేత

పాఠశాల ప్రాంగణాన్ని చదును చేస్తున్న జెసిబి

రొద్దం : మండలంలోని పెద్దగువ్వలపల్లి ఎంపియుపి పాఠశాల ప్రాంగణాన్ని గురువారం జెసిబి సాయంతో చదును చేయించారు. పాఠశాల ప్రాంగణం గుంతలమయం కావడంతో వర్షం కురిస్తే పెద్దఎత్తున నీరు చేరి మడుగును తలపించేది. అంతేకాకుండా పక్కనే ఉన్న వాటర్ ప్లాంట్ వృథా నీరు కూడా అందులో చేరడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ విషయంపై గత నెల 25వ తేదీ ప్రజాశక్తిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఉపాధ్యాయురాలు సమస్యను స్థానిక టిడిపి నాయకులు చిన్నప్పయ్యకు వివరించగా ఆయన జెసిబి ఏర్పాటు చేయించి పాఠశాల ప్రాంగణంలో నీటిని తొలగించి గరుగుమట్టి తోలి చదును చేయించారు.

ఫ్రెండ్స్ ట్రస్టు ఆధ్వర్యంలో వైద్య శిబిరం

తలుపుల : మండలంలోని ఈదులకుంట్లపల్లి పంచాయతీలో గురువారం రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పుష్పగిరి కంటి ఆసుపత్రి యాజమాన్యం సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ట్రస్ట్ ఛైర్మన్ మన్సూర్ మాట్లాడుతూ పేదలకు ఎలాంటి సేవ చేసేందుకైనా ఫ్రెండ్స్ ట్రస్ట్ ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఈ శిబిరంలో 75 మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేసి అందులో 21 మందికి కళ్లద్దాలు, మరో 21 మందిని కంటి ఆపరేషన్ కోసం కడపలోని పుష్పగిరి హాస్పిటల్‌కు పంపించారు. శిబిరంలో ప్రభుత్వ హోమియోపతి వైద్యాధికారి లక్ష్మీనరసయ్య, సిహెచ్ఒ చంద్రమోహన్ నాయక్, ఈదుల కుంట్ల పల్లి పంచాయతీ కార్య దర్శి, వీఆర్వో, ఆశా వర్కర్లు, ట్రస్టు సభ్యులు మల్హోత్రా, ప్రకాష్, వేణు, పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన నందు, రిత్విక్‌తో ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థుల ఎంపిక

లేపాక్షి : రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు స్థానిక కెజిబివి విద్యార్థిని నందు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ నీలిమ తెలిపారు. పదో తరగతి చదువుతున్న నందు బాలికల అండర్-17 విభాగంలో జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైందన్నారు. నందు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థినిని ప్రిన్సిపల్‌తో పాటు పిఇఒ వాణి, బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

కొత్తచెరువు : స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి రిత్విక్ రాష్ట్ర స్థాయి అండర్-14 ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పిఇటి వెంకటేష్ తెలిపారు. అనంతపురంలో గురువారం జరిగిన జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ చాటిన రిత్విక్‌ను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

దళారులను నమ్మొద్దు

ప్రజాశక్తి-రొద్దం

సోలార్ ప్లాంట్‌కు భూములు ఇవ్వడంలో రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని టిడిపి నాయకులు సూచించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం సీనియర్ నాయకులు మాధవనాయుడు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలో కొన్ని ప్రాంతాలకు సోలార్ విద్యుత్ పరిశ్రమలు వచ్చే అవకాశం ఉందని, సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు భూములు ఇచ్చే రైతులు దళారులను నమ్మి వారికి భూమిని అప్పగించొద్దని సూచించారు. కొందరు దళారులు రైతులతో కొన్నేళ్లకు అగ్రిమెంటు చేసుకొని కంపెనీ ప్రతినిధుల వద్దకువెళ్లి వారి పేరుపై రిజిస్ట్రేషన్ చేయించి రైతులకు తక్కువ మొత్తంలో డబ్బులు చెల్లిస్తారన్నారు. అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. కొన్ని చోట్ల ఏడాదికి ఎకరాకు రూ. 40 వేలు ఇస్తున్నారని, అలాంటి నమ్మకమైన పరిశ్రమ ప్రతినిధులను రైతులు స్వయంగా కలిసి మాట్లాడి నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కంపెనీకి సంబంధించిన వ్యక్తులతోనే అగ్రిమెంటు చేసుకోవాలని, ప్రయివేటు వ్యక్తులను నమ్మవద్దన్నారు. సమావేశంలో టిడిపి మండల కన్వీనర్ నరహరి, చిన్నప్పయ్య, వెంకటరామిరెడ్డి, నరసింహులు, వీరాంజి, అశ్వర్థనారాయణ, చెన్నకేశవులు, అక్బర్, మారెప్ప పాలన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు

రేపు కనకదాసు జయంతి

ప్రజాశక్తి-పెనుకొండ

రాష్ట్ర ప్రభుత్వం కురుబల ఆరాధ్య దైవం భక్త కనకదాసు జయంతిని అధికారికంగా నిర్వహిస్తుందని, అందులో భాగంగా పెనుకొండలో కనకదాసు జయంతి ఉత్సవాలను విజయవంతం చేద్దామని కురుబ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో గురు వారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కనకదాసు జయంతిని ఘనంగా నిర్వహించాలని తీర్మానించారు. కనకదాసు జయంతి సభలో మంత్రి సవిత పాల్గొంటారని, నియోజకవర్గంలోని 5 మండలాల నుంచి కురుబ సంఘం నాయకులు హాజరుకావాలని కోరారు. అనంతరం కళ్యాణదుర్గంలో కనకదాసు విగ్రహావిష్కరణ కార్యక్రమానికి తరలివెళ్లాలన్నారు. కార్యక్రమంలో కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, మండల కన్వీనర్ ఈశ్వరప్రసాద్, నాయకులు సిద్ధలింగప్ప, అశ్వత్థ సత్యనారాయణ, రామాంజనేయులు, వెంకటరాముడు, ముత్యాలప్ప, శివన్న, శ్రీనివాసులు, శ్రీరాములు, ఆదినారాయణ పాల్గొన్నారు.

అంధుల ఆశ్రమానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-కదిరి అర్బన్

హైదరాబాద్‌లోని ఓ అంధుల ఓల్డేజ్ హోమ్‌కు పట్టణంలోని శ్రీశాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ అధినేత, గురుబ్రహ్మ అవార్డు గ్రహీత మూమెంట్ సలీంబాషా రూ. 24 వేలు అందజేశారు. ఆశ్రమం ప్రతినిధులు మాట్లాడుతూ సంగీతాన్ని ఆస్వాదించడం, తమ వంతు సాయం చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచి సేవాభావం అలవర్చుకోవాలని సలీం బాషా సూచించారు. విరాళం అందించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, హెచ్ఎం, ఉపాధ్యాయులు, ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ సిహెచ్.భూషణ్, గాయకుడు ఆర్,నిఖిల్, చందు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసిపి నేత మృతికి నివాళి

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని ఇటికేపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు రంగనాథ్‌గౌడ్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతుండేవాడు. ఈక్రమంలో బెంగళూరులోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందగా మృతదేహాన్ని స్వగ్రామం తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న మడకశిర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఎస్ఎల్.ఈరలక్కప్ప ఇటికేపల్లి గ్రామం వెళ్లి రంగనాథ్‌గౌడ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష్, సర్పంచి ఈరన్న, కాంతరాజు, రత్నశేఖర్, శ్రీరామప్ప, రంగనాథ్, కృష్ణమూర్తి ఉన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్‌పార్టీ నాయకులు

'కేంద్రంలో అరాచక పాలన'

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తుందని కాంగ్రెస్‌పార్టీ నాయకులు మండి పడ్డారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో గురువారం నాయకులు తుంపర్తి పరమేష్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో శాశ్వతమైన సంస్కరణలు తెచ్చింది, ప్రజలు, దేశం కోసం ప్రాణాలు సైతం లెక్క చేయనిది గాంధీ కుటుంబం, కాంగ్రెస్ పార్టీ మాత్రమే అన్నారు. ప్రస్తుత బిజెపి ప్రభుత్వం మాత్రం ప్రజలను మోసం చేస్తూ ఓట్ల చోరీకి పాల్పడుతూ దొంగ ఓట్లతో గద్దెనెక్కి అరాచక పాలన సాగిస్తుందన్నారు. ఇలాంటి వారు రాహుల్‌గాంధీపై విమర్శలు చేయడం శోచనీయమన్నారు. బిజెపి నాయకులు ఒక్కరైనా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారో చెప్పాలని ప్రశ్నించారు. కులాలు, మతాల పేరుతో అరాచకాలు చేస్తున్న బిజెపి దేశంలో రాజ్యాంగేతర శక్తిగా ఎదగాలని చూస్తోందని, అందుకు రాహుల్‌గాంధీ అడ్డుగా వున్నారన్నారు. దేశ ప్రజలు అన్నీ గమనిస్తున్నారని 2029లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొస్తారని రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రిని చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఖలిమ్, దాదాపిర్, రాజు, గణేష్, బాషా, అమిర్ తదితరులు పాల్గొన్నారు.

తేజశ్వినికి షూ అందజేస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్తు

కదిరి అర్బన్ : విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్తు ఉంటుందని కదిరి సీనియర్ క్రీడాకారుడు, ప్రస్తుత డోన్ డీఎస్పీ శ్రీనివాసులు సూచించారు. భారత మహిళా క్రికెట్ జట్టు ప్రపంచ కప్ సాధించిన శుభ సందర్భంలో గురువారం ఆయన పట్టణంలో రాష్ట్ర స్థాయి మహిళా క్రికెటర్‌ను ప్రోత్సహించారు. అండర్-15 రాష్ట్ర జట్టుకు ఆడడంతో పాటు జాతీయ శిక్షణ శిబిరంలో శిక్షణ పొందిన, ఈ ఏడాది అండర్-19 రాష్ట్ర మహిళా జట్టులో స్టాండ్ బైగా రాణించిన క్రీడాకారిణి తేజశ్వినికి క్రికెట్ కిట్, ఇతర వస్తువులు అందజేసి అభినందించారు. తేజశ్విని భవిష్యత్తులో జాతీయ జట్టుకు ఎంపికవ్వాలని ఆకాంక్షిస్తూ అందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు జగన్, మాబు, ఉదయ్, షామీర్, షకీల్, నజీర్ పాల్గొన్నారు.

నేడు మడకశిరలో ప్రజాగ్రీవెన్స్

మడకశిర రూరల్ : పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రజా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు గురువారం టిడిపి నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. అందులో ఎమ్మెల్యే ఎంఎస్.రాజు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ పొందుపరిచి అర్జీలు ఇవ్వాలని సూచించారు.

రీ -సర్వే పూర్తి

ముదిగుబ్బ : మండలంలోని నాగిరెడ్డి పల్లెలో రీ సర్వే పూర్తయిందని సర్వేయర్ అలీషా గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో మొత్తం 3105.76 ఎకరాల భూమికి రీ సర్వే చేశామన్నారు. అందులో 500 ఎకరాలు అటవీ భూమి ఉందని, అది 1995 అటవీ చట్టం ప్రకారం ఉన్న రికార్డుల మేరకు ఉందని తెలిపారు. మొత్తం భూ సర్వేలో 16 శాతం మాత్రం సబ్ డివిజన్, పక్కన మండలాల పరిధిలోని జాయింట్ భూములు, కోర్టు సమస్యల్లో ఉన్నందున వాటికి సంబంధించిన సర్వేను చేయలేదని వివరించారు.

పాపిసానపల్లి పాఠశాలలో బదిలీ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-మడకశిర రూరల్

మండలంలోని పాపిసానపల్లి జడ్పీ హైస్కూల్‌లో పని చేస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు నాగరాజు, సురేష్, వెంకటేష్‌లను గురువారం హెచ్ఎం రామకృష్ణ ఆధ్వర్యంలో అదే పాఠశాలలో ఘనంగా సన్మానించారు వారిని హెచ్ఎంతో పాటు ఉపాధ్యా యులు పూలమాలలు, శాలు వాలతో సన్మానిం చారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమం లో ఉపాధ్యాయులు హరిప్రసాద్, శివకుమార్, రమేష్, బాబా, కైరున్‌బి, వాణికుమారి, విజయ, సతీష్, ఎస్ఎంసి ఛైర్‌పర్సన్ నేత్రావతి, సభ్యులు ప్రభావతి, అరుణ, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ సర్పంచి మృతి

ప్రజాశక్తి-పెనుకొండ

కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మండలంలోని గోనిపేట పంచాయతీ సర్పంచి తలారి నాగరాజు(54) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. వివరాలు.. నాగరాజు టిబి వ్యాధితో బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో గత మంగళవారం ఇంట్లో ఉన్న క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే పెనుకొండ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం ప్రభుత్వాసుపత్రికి అక్కడి నుంచి బెంగళూరులోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని భార్య మీనాక్షి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వినియోగంలోకి వాటర్ ప్లాంట్..

ప్రజాశక్తి-తలుపుల

మండలంలోని పెద్దన్నవారిపల్లిలో కొన్నేళ్లుగా వాటర్ ప్లాంట్ నిర్వహించకపోవడంతో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ విషయాన్ని స్థానిక టిడిపి నాయకులు ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన వెంటనే వాటర్ ప్లాంట్ మంజూరు చేయించారు. దీంతో వాటర్ ప్లాంట్ నిర్వహణ కోసం టిడిపి గురువారం కాయిన్ బాక్స్ ఏర్పాటు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు మేడా శంకర్, గంగరాజు, ఎరికిలప్ప, మల్లేష్‌నాయుడు, మర్రి చింతలప్ప, రామాంజులు, గంగయ్య, హైదర్‌వలి, వెంకటేశ్, వెంకటరమణ, మర్రి గంగయ్య, వేమల రాజు, మర్రి ముసలప్ప, తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ వద్ద నీరు పట్టుకుంటున్న గ్రామస్తులు

కళ్లను సంరక్షించుకోవాలి

కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కొత్తచెరువు

ప్రతి ఒక్కరూ వైద్యుల సలహాలు పాటిస్తూ కళ్లను సంరక్షించుకోవాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి సూచించారు. స్థానిక పిహెచ్‌సిలో గురువారం నిర్వహించిన కంటి వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. ముందుగా శ్రీసత్యసాయి బాబా చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. వారు మాట్లాడుతూ జీవులకు కళ్లు ఎంతో ముఖ్యమన్నారు. కళ్లు లేకపోతే జీవితం అంధకారం అవుతుందన్నారు. కంటికి పొర వస్తే వైద్యులను సంప్రదించి శస్త్రచికిత్స చేయించుకుని కంటి చూపు మెరుగుపరచుకోవాలన్నారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ మొబైల్, కంప్యూటర్, టీవీలు ఎక్కువగా చూడటం వల్ల చాలా మందికి కంటి చూపు తగ్గుతుందన్నారు. సాధ్యమైనంతవరకూ వాటి వాడకం బాగా తగ్గించాలని సూచించారు. మనిషికి కళ్ళు ఎంతో ప్రధానమైనదని వాటికి తగిన జాగ్రత్తలు వైద్యుల సలహా మేరకు పొందాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ ఫైరోజ్ బేగం, డిఐఒ సురేష్‌బాబు, డిసిహెచ్ఎస్ మధుసూదన్, డిబిసిఒ అనురాధ, డాక్టర్లు అశ్వితకుమార్, ఎల్లా రాముడు, సిహెచ్ఒ వన్నప్ప, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, నాయకులు లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, రామకృష్ణ, కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, రమేష్‌రెడ్డి, టీచర్ నాగేంద్ర, హరిప్రసాద్, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.



సత్యసాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

ఆసుపత్రిని పరిశీలించిన కలెక్టర్

కలెక్టర్ పిహెచ్‌సిని పరిశీలించి ఆసుపత్రితో పాటు ప్రాంగణం, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. అలాగే వసతులను పరిశీలించారు. భవనం పైకప్పు శిథిలావస్థకు చేరిన విషయాన్ని గుర్తించి మరమ్మతులకు నిధులు మంజూరు చేయిస్తానన్నారు. పరిసర ప్రాంతాల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయని వాటిని తక్షణమే తొలగించాలని సూచించారు.

వైద్య కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకిద్దాం

ప్రజాశక్తి-చిలమత్తూరు

రాష్ట్రంలో వైద్య కళాశాలల ప్రయివేటీకరణను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని వైసిపి నాయకుడు వేణురెడ్డి పిలుపునిచ్చారు. చిలమత్తూరు, దేమకేతేపల్లి పంచాయితీల్లో గురువారం ఆయన ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో అప్పటి సిఎం జగన్ పేదలకు వైద్యం, వైద్య విద్య మరింత నాణ్యతగా చేరువ చేయాలన్న లక్ష్యంతో 17 వైద్య కళాశా లలు మంజూరు చేయించారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం స్వార్థ ప్రయోజనాల కోసం వాటిని ప్రయివేటు వ్యక్తులకు అప్పగించేందుకు కుట్రలు చేస్తోందన్నారు. వైద్య కళాశాలలను ప్రయివేటీకరణ చేస్తే పేదలకు వైద్యం, పేద పిల్లలకు వైద్య విద్య దూరమవుతుందని మండిపడ్డారు. కావున కూటమి ప్రభుత్వం ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకునేంత వరకూ ప్రజలు వైసిపి పోరాటాలకు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి, అమానుల్లా, వరుణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వేణురెడ్డి

ఆర్‌టిఒకు ప్రయివేట్ పాఠశాలల సంఘం వినతి

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలోని ప్రయివేట్ పాఠశాలల సంఘం నాయకులు గురువారం స్థానిక ఆర్‌టిఒ కార్యాలయంలో ఆర్‌టిఒ శ్రీనివాసులును కలిసి వినతిపత్రం అందజేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు ప్రమాదం కారణంగా రాష్ట్ర ప్రభుత్వం స్కూల్ బస్సులను తనిఖీ చేయాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ మేరకు ఈ నెల 10వ తేదీ నుంచి తనిఖీలు ప్రారంభమవుతాయని తమకు నోటీసులు అందాయన్నారు. ఈ విషయమై సంఘం రాష్ట్ర నాయకులు రాష్ట్ర రవాణా శాఖ మంత్రితో పాటు ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారన్నారు. ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయని, కావున కొంత సమయం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పలు పాఠశాలల కరస్పాండెంట్లు ఎంఎస్.కిరణ్, శంకర్, సురేష్, రమేష్‌నాయక్, సోమశేఖర్, కృష్ణమూర్తి, మహబూబ్‌బాషా, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

ఆగ్రో ఫారెస్ట్ ప్లాంట్ పరిశీలన

ప్రజాశక్తి-గుడిబండ

ఏకపంట విధానం కంటే ఆగ్రో ఫారెస్ట్ విధానం వల్ల రైతులు అధికంగా లాభపడతారని అకార్న్ నెదర్లాండ్ ప్రాజెక్టు అధికార ప్రతినిధులు హార్మ్, మీల తెలిపారు. మండలంలోని తిమ్మలాపురం గ్రామం లో ఆర్‌డిటి ఎఫ్ ఎకాలజీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహి స్తున్న ఆగ్రో ఫారెస్ట్ ప్లాంట్‌ను గురువారం వారు పరిశీలించారు. వారికి ఆర్‌డిటి ఎఫ్ ఎకాలజీ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వీరభద్రారెడ్డి, ఫీల్డ్ కోఆర్డినేటర్ శంకర్ అకార్న్ ప్రాజెక్టు గురించి వివరించారు. ప్రాజెక్టు అధికార ప్రతినిధులు మాట్లాడుతూ రైతులు ఆగ్రో ఫారెస్ట్ విధానంలోకి మారాలన్నారు. చింత చెట్లలో ఏదో ఒక రకమైన మొక్క నాటుకోవాలని సూచించారు. అయితే గ్రామస్తుల కోరిక మేరకు జూన్‌లో మహాగని, సీతాఫలం, పనస మొక్కలను ఉచితంగా అందిస్తామని వీరభద్రారెడ్డి తెలిపారు. పండ్ల తోటల పెంపకం వల్ల 20 ఏళ్ల పాటు ఆదాయం వస్తుందని శంకర్ తెలిపారు. అనంతరం వారు చింత చెట్ల పండ్లతోటలను సందర్శించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అంతకుముందు వారికి గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. వారి వెంట ఫీల్డ్ సూపర్వైజర్ రమేష్, కౌన్సిల్ మెంబర్ జయన్న, ప్రకాష్, హేమరాజు, మల్లికార్జున, రైతులు ఉన్నారు.

పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని వినతి

పెనుకొండ : పూర్వీకుల నుంచి సంక్రమించిన భూమికి పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని కోరుతూ గురువారం బాధిత రైతులు ఆర్డీవో ఆనంద్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. బాధిత రైతులు సయ్యద్ అస్లాం జావిద్, సయ్యద్ బర్కతుల్లా, సయ్యద్ ఎద్దుల్లా హుసేన్, సయ్యద్ అస్లాం బాషా, సయ్యద్ మజార్ మాట్లాడుతూ సర్వే నెంబర్ 334-1లో 7.42 ఎకరాలు, 334-3లో 7.42 ఎకరాల భూమి ఉందన్నారు. వారసులమైన మేము ఆ భూములకు సంబంధించిన రికార్డులను రెవెన్యూ అధికారులకు అందించి 1-బి అడంగల్, పట్టాదారు పాసుపుస్తకాల కోసం దరఖాస్తు చేసుకున్నామన్నారు. మా పేరుపై రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలని కోరారు.

ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తున్న బాధితులు

జెఎల్‌ఎంపై టిడిపి నేత తిట్ల దండకం

చిలమత్తూరు : టిడిపి మండల నాయకుడు రంగారెడ్డి మండలంలోని కోడూరు సచివాలయం జెఎల్ఎం ఎస్ఎండి.అజీజ్‌పై అసభ్య పదజాలంతో దూషించిన ఓ ఫోన్ కాల్ ఆడియో(రికార్డింగ్ వాయిస్)సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. రికార్డు చేసిన ఫోన్ సంభాషణలో సదరు నాయకుడు తన పొలంలో విద్యుత్ స్తంభం ఎందుకు నాటుతున్నారని జెఎల్ఎంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ బూతులు తిట్టారు. వారి మధ్య జరుగుతున్న ఫోన్ సంభాషణలో ఏఈ(కాన్ఫరెన్స్ కాల్‌లో ఉన్నా) ఆ నాయకుడిని వారించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇటీవల ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చేతుల మీదుగా కోడూరు పరిధిలో ఉన్న 15 మంది రైతులకు 25 కెవి ట్రాన్స్‌ఫార్మర్లు పంపిణీ చేశారు. అయితే ఆ తర్వాత ఒక్కో రైతు నుంచి రూ. లక్ష వసూలు చేయాలని ఏఈ తనను ఆదేశించారన్నారు. తాను ఒక్కో రైతు నుంచి రూ. 20వేలు మాత్రమే వసూలు చేశానని, దీంతో నన్ను ఇబ్బందులు పెడుతున్నారని, మెమో కూడా ఇచ్చారని లైన్‌మెన్ ఎస్ఎండి.అజీజ్ వీడియో ద్వారా ఆరోపించారు. టిడిపి నాయకుడు ఒత్తిళ్లతోనే ఏఈ తనను వేధిస్తున్నారని అజీజ్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయంపై జెఎల్ఎం ఎమ్మెల్యేకు వీడియో ద్వారా ఫిర్యాదు చేశారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

గోరంట్ల : ఎన్నికల హామీ మేరకు ఎంపీ బికె.పార్థసారథి మంజూరు చేసిన రూ. 10 లక్షల నిధులతో పట్టణంలోని 4వ వార్డులో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు గురువారం టిడిపి నాయకులు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మలసముద్రం సర్పంచి సువర్ణ అశర్థరెడ్డి నీలకంఠారెడ్డి, ఫిరోజ్‌ఖాన్, నాయకులు లక్ష్మీనారాయణ, జనసేన మండలాధ్యక్షులు సంతోష్, నరసింహప్ప, నరేంద్ర, సింగిల్‌విండో డైరెక్టర్లు నగేష్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

పేరు మార్పు/సవరణ

నా కుమారుడు టి.సాయి, S/o. తొండమాల మల్లికార్జున, నివాసం: డోర్.నెం.20-443, లోనికోట, వార్డు నెం.20, ధర్మవరం, శ్రీ సత్యసాయి జిల్లా. ప్రస్తుతం నా కుమారుడి ఆధార్‌లో అతని పేరు టి.సాయి అని తప్పుగా నమోదు కాబడినది. ఇప్పుడు పుట్టిన తేది సర్టిఫికేట్ ప్రకారం మార్పు / సవరణ చేయగా, **తొండమాల కీర్తి వర్ధన్,** S/o. **తొండమాల మల్లికార్జున(THONDAMALA KEERTHI VARDHAN, S/o. THONDAMALA MALLIKARJUNA)** గా మార్పు చేయుట జరుగుతుంది. నేటి నుండి నా కుమారుడి పేరు **తొండమాల కీర్తి వర్ధన్‌గా** పిలవబడును. ఆధార్‌లో మార్పు కొరకు.

IN THE COURT OF THE III ADDL. DISTRICT JUDGE: ANANTHAPURAMU
E.P. No.809/2024 in O.S.No.40/2014

Between:
D.Sreenivasulu ...Petitioner/D.Hr
AND
S.Anasuya and others ...Respondents/J.Drs

Sale Notice to J.Dr No.2&3

J.Dr2: S.Amaresh, S/o Late Saddala Chennakesavulu,
J.Dr3: R.Rajyalakshmi, W/o. Suresh,
Both are R/o D.No.15/308, Opp. Girls Junior College, PRT Street, Dharmavaram Town, Sri Sathyasai District.

పై E.P లో J.Dr's అయిన మీకు సేల్ నోటీసు నిమిత్తము పై కేసు 03-12-2025వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(By order of the court)
K.SREENIVAS REDDY,
Advocate, Ananthapuramu,
Cell:9848226646